

సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభకు ముస్తాబవుతున్న వేదిక



సీఎం కేసీఆర్ హెలికాప్టర్ కోసం సిద్ధం చేసిన హెలిప్యాడ్



నర్సాపూర్‌లో సీఎం ఆశీర్వాద సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి హరీశ్‌రావు

# నిండు మనసుతో సునీతమ్మను ఆశీర్వదించండి

## తండాల అభివృద్ధికి రెండు దఫాలుగా రూ.202 కోట్లు

- గిరిజనులను పట్టించుకోని కాంగ్రెస్
- కాంగ్రెస్‌కు ఓటేస్తే కన్నీళ్లు..
- బీఆర్ఎస్‌కు ఓటేస్తే పొలాల్లో నీళ్లు
- రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు

నర్సాపూర్, నవంబర్ 15: ఆడబిడ్డ సునీతమ్మను నిండు మనసుతో ఆశీర్వదించి, గెలిపించాలని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు కోరారు. నర్సాపూర్ పట్టణంలో నేడు (గురువారం) నిర్వహించనున్న ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభా ప్రాంగణాన్ని ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, నర్సాపూర్ బీఆర్ఎస్ అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డితో కలిసి మంత్రి హరీశ్‌రావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ సభకు రైతులు, మహిళలు, యువకులు, గిరిజనులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు స్వచ్ఛందంగా పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. నర్సాపూర్ నియోజకవర్గంలోని గిరిజనులకు ఎమ్మెల్యే మదన్‌రెడ్డి పట్టుబట్టి ముఖ్యమంత్రి కేసీఆర్ నుంచి రెండు ప్యాకేజీలు తీసుకొచ్చారన్నారు. మొదటి ప్యాకేజీగా రూ.56 కోట్లు, రెండో ప్యాకేజీగా రూ.146 కోట్లు తీసుకొచ్చారన్నారు. ఈ ప్యాకేజీలతో గిరిజన తండాలకు సీసీ రోడ్లు, బీటీ రోడ్లు వేయించారని గుర్తుచేశారు. గిరిజనులకు అంత డబ్బు రావడం నర్సాపూర్ చరిత్రలోనే ఇది మొదటిసారని తెలిపారు. గిరిజనుల కోసం 10 శాతం రిజర్వేషన్, అధికారికంగా సేవాలాల్ జయంతి, లంబాడీలకు అత్యధిక సీట్లు ఇచ్చామన్నారు. గతంలో కాంగ్రెస్ గిరిజనులను పట్టించుకోలేదని దుయ్యబట్టారు. కర్ణాటక రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో నాలుగు నెలల నుంచి నిరుద్యోగులు ధర్నాలు చేస్తున్నారని, 250 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నేడు తెలంగాణలో ఆత్మహత్యలు లేవన్నారు. ఉద్యమాన్ని, పాలనను ముఖ్యమంత్రి కేసీఆర్ నీతి, నిజాయితీ, నిబద్ధతతో కొనసాగించారన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి నీతి, నిజాయితీ లేదని విమర్శించారు. రైతుబంధు కింద 11 విడతల్లో రూ.72 వేల కోట్లు ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుల ఖాతాలో వేశారన్నారు. సగటున 2 ఎకరాలు ఉన్న రైతులకు రైతుబంధు కింద రూ.లక్షా 6 వేలు నేరుగా ఖాతాలో జమ చేశామన్నారు. అసైన్డ్ భూములను బీఆర్ఎస్ లాక్కుంటుందని, కాంగ్రెస్, బీజేపీలు దుష్ప్రచారం చేస్తున్నాయని, మ్యానిఫెస్టో వాళ్లు సరిగ్గా చూశారో లేదో అర్థం కావడం లేదని విమర్శించారు. అసైన్డ్ భూములను పట్టా భూములుగా మార్చి ఎస్సీ, ఎస్టీ, బీసీలకు పూర్తి హక్కులు కల్పిస్తామని వెల్లడించారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టో, కాంగ్రెస్ మ్యానిఫెస్టో కన్నా చాలా మెరుగ్గా ఉన్నదన్నారు. గత కాంగ్రెస్ పాలనలో విద్యుత్ లేక రైతుల కండ్లలో కన్నీళ్లు వచ్చాయని, బీఆర్ఎస్ సర్కారు హయాంలో పొలాల్లోకి నీళ్లు వచ్చాయన్నారు. కన్నీళ్లు కావాలా.. పొలాల్లో నీళ్లు కావాలా ప్రజలు తేల్చుకోవాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే మూడు గంటల కరెంట్ ఒప్పుకున్నట్లే అవుతుందని ప్రజలు ఆలోచించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాలి అనిల్‌కుమార్, బీజేపీ రాష్ట్ర కన్వీనర్ సింగాయిపల్లి గోపి నేడు కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర లేబర్ వెల్ఫేర్ బోర్డ్ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకట్రాంరెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు శ్రీధర్‌గుప్తా, అశోక్‌గౌడ్, ఆత్మ కమిటీ చైర్మన్ వెంకట్‌రెడ్డి, వైస్ ఎంపీపీ వెంకట నర్సింగరావు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



కటౌట్ల కోసం ఏర్పాట్లు చేస్తున్న కూలీలు



బారికేడ్లు ఏర్పాటుచేస్తున్న కూలీలు

# పనిచేసే వారికి కాంగ్రెస్‌లో గౌరవం లేదు

## రాష్ట్ర నేతల తీరుతో మనస్తాపం చెందా..

- టికెట్ ఇవ్వకుండా మోసం చేశారు
- బీసీ కోటాలో సీటు వస్తుందని ఆశించా..
- ఈడీ నోటీసులను సైతం ఎదుర్కొని పార్టీ కోసం పని చేశా..
- అప్లికేషన్ పెట్టుకోని వారికి కూడా టికెట్ ఇవ్వడం బాధాకరం
- టీపీసీసీ ఉపాధ్యక్షుడు గాలి అనిల్ కుమార్
- కాంగ్రెస్‌కు రాజీనామా, శ్రేయాభిలాషులతో మాట్లాడి నిర్ణయం ప్రకటిస్తానని వెల్లడి



పటాన్‌చెరులో రాజీనామా నిర్ణయాన్ని ప్రకటిస్తున్న కాంగ్రెస్ నాయకుడు గాలి అనిల్‌కుమార్, తదితరులు

పటాన్‌చెరు, నవంబర్ 15: కాంగ్రెస్ పార్టీకి టీపీసీసీ ఉపాధ్యక్షుడు గాలి అనిల్‌కుమార్ రాజీనామా చేశారు. బుధవారం సంగారెడ్డి జిల్లా అశోక్‌నగర్‌లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమవేశంలో అనిల్‌కుమార్ రాజీనామా లేఖను విడుదల చేసి, రాజీనామా లేఖను ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గెకు పంపించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నేతల తీరుతో మనస్థాపం చెంది పార్టీకి రాజీనామా చేస్తున్నానని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఓడిపోయి దీనస్థితిలో ఉన్న సమయంలో ఆ పార్టీ జెండాను మోసినట్టు గుర్తు చేశారు. పార్టీ కోసం ఎన్నో త్యాగాలు చేశామని, ఖర్చుకు వెనుకాడలేదన్నారు. ఇప్పుడు టికెట్ ఇచ్చే సమయంలో పార్టీ రాష్ట్ర నేతలు వ్యవహరించిన తీరు బాగాలేదన్నారు. పార్టీ కోసం 24 గంటలు కష్టపడిన వారిని కాదని టికెట్ కావాలని అప్లికేషన్ కూడా పెట్టని వారికి టికెట్ కేటాయించడం అన్యాయమన్నారు. అప్లికేషన్ పెట్టని 40మందికి టికెట్లు ఇచ్చారని ఆరోపించారు. బీసీలకు న్యాయంగా 34 సీట్లు ఇస్తామని మొండిచెయ్యి చూపించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌లో కష్టపడిన వారికి న్యాయం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఎంపీగా కాంగ్రెస్ పార్టీ నుంచి ఐదేండ్ల క్రితం పోటీలో నిలబడి 2.80లక్షల ఓట్లు సాధించానన్నారు. తనకంటే ముందు పోటీపడిన వారికి 1.60లక్షల ఓట్లే వచ్చాయన్నారు. కష్టకాలంలో పార్టీ కోసం నిలబడితే ఇప్పుడు పార్టీ రాష్ట్ర నేతలు తనకు అన్యాయం చేశారన్నారు. ఆఖరికి జాతీయ పత్రికలకు యాడ్లు ఇచ్చినందుకు ఈడీ నోటీసులు, ఐటీ నోటీసులు ఎదుర్కొనట్టు చెప్పారు. ఎన్ని కష్టాలు వచ్చినా పార్టీలో ఏదో పదవి, పార్టీ టికెట్ ఇస్తారనే ఆశతోనే కదా అని పేర్కొన్నారు. కష్టపడేది టికెట్ కోసమైనప్పుడు ఆ టికెట్‌ను ఇవ్వకపోవడం తనను బాధించిందన్నారు. పార్టీ టికెట్లు ప్రకటించకముందున్న గ్రాఫ్ టికెట్లు కేటాయింపులు జరిగాక పడిపోయిందన్నారు. టికెట్ రాని విషయంలో ఇప్పటివరకు రాష్ట్ర నాయకులెవరూ తనకు సరైన వివరణ ఇవ్వలేదన్నారు. ఇటీవల జరిగిన పరిణామాలు నా అభిమానులకు, పార్టీ కార్యకర్తలకు తీవ్రంగా కలిచి వేశాయన్నారు. పార్టీ నాతో వ్యవహరించిన తీరుతో అభిమానుల మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. రాష్ట్ర నాయకులు తనతో మాట్లాడేందుకు కూడా ఆసక్తితో లేరన్నారు. పెద్దసంఖ్యలో కార్యకర్తలు తనవద్దకు వచ్చి వారి ఆవేదన వ్యక్తం చేశారన్నారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం చిత్తశుద్ధితో పనిచేసిన వారికి పార్టీలో సరైన గౌరవమర్యాదలు, ప్రాధాన్యతలు దక్కడం లేదన్నారు. తాను పార్టీ కోసం పనిచేసి అన్ని విధాలుగా నష్టపోయినట్టుగా తెలిపారు. కార్యకర్తలు, అభిమానుల ఒత్తిడి మేరకు, వారి మనోభావాలను గౌరవిస్తూ కాంగ్రెస్ పార్టీకి, ప్రాథమిక సభ్యత్వానికి, పార్టీ పదవులన్నింటికీ రాజీనామా చేస్తున్నానని గాలి అనిల్ కుమార్ చెప్పారు. తనతోపాటు పెద్దసంఖ్యలో అభిమానులు, నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌ను వీడుతున్నారన్నారు. మరింతమంది రాజీనామాలుంటాయని ఆసక్తి రేకెత్తించారు. త్వరలోనే తన భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తానన్నారు. తన శ్రేయాభిలాషులు, పార్టీ శ్రేణులతో చర్చించి నిర్ణయం తీసుకుంటానన్నారు. సమావేశం లో ఎంపీపీ నర్సాపూర్ జోయతి సురేశ్‌నాయక్, బ్లాక్ కాంగ్రెస్ కౌడిపల్లి ప్రెసిడెంట్ ఎల్లుగారి శ్రీనివాస్ రెడ్డి, నర్సాపూర్ మైనార్టీ ప్రెసిడెంట్ అజ్మత్, టీబీవీఎస్ బీసీ స్టేట్ ప్రెసిడెంట్ ఉగ్గే శ్రీనివాస్ పటేల్, ఆవుల రమేశ్, బీసీ సంఘం నాయకులు నాయికోటి జీతయ్య, నర్సింగ్‌రావు, ఆకుల యాదయ్య, బత్తుల రాములు, నాయికోటి వెంకటేశ్, సందీప్, హఫీజ్, అన్వర్ ఖాన్, సమీయుద్దీన్, అఫ్రోజ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.